ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

ఆదివారం 18 ఫిబ్రవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.146	212	241
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.146	212	241

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 । కనిష్ఠం 19.4



మునిసిపాలిటీలపై మారుతున్న జెండా


- ఒక్కోటిగా కాంగ్రెస్ ఖాతాలోకి
- కౌన్సిలర్ల జంపింగ్‌లతో మారిన సీన్
- 18 పురపాలికల నుంచి ఆరుకు పడిపోయిన బీఆర్ఎస్
- కాంగ్రెస్‌కు తొమ్మిది, త్వరలో 13కు చేరే అవకాశం

మునిసిపాలిటీల్లో పాలకవర్గాల కైవసానికి కాంగ్రెస్ అమలుచేస్తున్న వ్యూహం ఫలిస్తోంది. కీలకమైన రాజకీయ ప్రాతినిధ్యం ఉండే పురపాలక సంఘాల్లో పాలకవర్గాలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటేనే నిధుల కేటాయింపు, పనుల నిర్వహణలో ఆటంకాలు ఉండవనే సూత్రీకరణతో అధికార బదలాయింపు జరుగుతోంది. ఈ మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపాలిటీల్లో అధికారమార్పిడి వేగవంతమైంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో 2020లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో 19 మునిసిపాలిటీలకు 17 పురపాలికలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఎన్నికల అనంతరం స్వల్పకాలంలోనే చండూరు మునిసిపల్ చైర్మన్ బీఆర్ఎస్‌లో చేరగా, ఆ సంఖ్య 18కి చేరింది. తాజాగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో దేవరకొండ, చిట్యాల, హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్లు కాంగ్రెస్‌లో చేరడంతో అసెంబ్లీ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ చేతిలో 15 మునిసిపాలిటీలు ఉండగా, కాంగ్రెస్‌కు నాలుగు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మునిసిపాలిటీల్లో కౌన్సిలర్ల జంపింగ్‌లు, అవిశ్వాసాలతో బీఆర్ఎస్ నుంచి ఒక్కో స్థానం చేజారింది. ప్రస్తుతం ఆరు మునిసిపాలిటీలు మాత్రమే బీఆర్ఎస్ చేతిలో మిగిలాయి. తొమ్మిది మునిసిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. మరో నాలుగు మునిసిపాలిటీల్లో అవిశ్వాసం ప్రక్రియ కొనసాగుతోంది. ఇవి కూడా దాదాపు కాంగ్రెస్ ఖాతాలోకే వస్తుండడంతో ఆ పార్టీ ఆధిక్యత 13 మునిసిపాలిటీలకు చేరనుంది. బీఆర్ఎస్‌కు మిగిలిన ఆరింటిలోనూ చివరి వరకు ఎన్ని ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంది.

కౌన్సిలర్ల జంప్‌తో కాంగ్రెస్ ఖాతాలోకి



మునిసిపాలిటీ పాలకవర్గాల నాలుగేళ్ల పదవీకాలం పూర్తయ్యాక 74వ రాజ్యాంగసవరణ ప్రకారం చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసానికి అనుమతిస్తారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మునిసిపల్ పాలకవర్గాల నాలుగేళ్ల పదవీకాలం తీరడంతో అవిశ్వాస తీర్మానాలు మొదలయ్యాయి. నల్లగొండ, కోదాడ, నేరేడుచర్లల్లో ఇప్పటికే అవిశ్వాసాలు పూర్తి కాగా, చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు కూడా పూర్తయ్యాయి. కాంగ్రెస్ కౌన్సిలర్లు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, సామినేని ప్రమీల, బచ్చలకూరి ప్రకాష్ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు. భువనగిరి, నందికొండ మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. ఇక్కడ మెజార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లోకి జంప్ చేయడంతో త్వరలో జరిగే చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ కౌన్సిలర్లే చైర్మన్లుగా ఎన్నికయ్యే అవకాశముంది. హాలియాలో బీఆర్ఎస్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ, మోత్కూరులో బీఆర్ఎస్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిపై అవిశ్వాసం నోటీసులిచ్చారు. ఈ రెండు మునిసిపాలిటీల్లో త్వరలో ఎన్నిక జరగాల్సి ఉంది. హాలియాలో ఇప్పటికే నోటీసు ఇచ్చిన కౌన్సిలర్లలో మెజార్టీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండడంతో త్వరలో ఇది కూడా కాంగ్రెస్ ఖాతాలోకి రావడం ఖాయంగా కనిపిస్తుంటే, మోత్కూరులోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

వార్డుల అభివృద్ధి కోసమే అంటున్న కౌన్సిలర్లు

ఉమ్మడి జిల్లాలో పార్టీ ఫిరాయిస్తున్న కౌన్సిలర్లు అంతా దాదాపు ఒకేరకమైన వాదనను వినిపిస్తున్నారు. గడిచిన నాలుగేళ్లలో తమ వార్డులకు నిధుల కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని, చైర్మన్లు, అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే అన్ని పనులు జరగడంతో తాము మిన్నకుండిపోయామని, చివరలోనైనా వార్డుల అభివృద్ధికి అవసరమైన నిధులు వస్తాయనే విశ్వాసం కాంగ్రెస్ నేతలు నుంచి కల్పిస్తుండడంతో పార్టీ ఫిరాయిస్తున్నామని కౌన్సిలర్లు చెబుతున్నారు. అయితే బీఆర్ఎస్ నుంచి వచ్చినవారికి మళ్లీ కౌన్సిలర్‌గా పోటీచేసే అవకాశం కల్పిస్తామని కొన్నిచోట్ల హామీలు లభిస్తే, కొందరికి మాత్రం కాంగ్రెస్ నుంచి అలాంటి హామీలేవీ ఇవ్వలేదని తెలిసింది. ఇప్పుడు పార్టీ మారిన కౌన్సిలర్లకు, వారిపై పోటీచేసి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య ఇప్పటికే కొన్ని మునిసిపాలిటీల్లో వర్గపోరు మొదలవడం, భవిష్యత్ రాజకీయాలపై ప్రభావం చూపనుందని భావిస్తున్నారు.

రెండు మునిసిపాలిటీల్లో బెడిసిన అవిశ్వాసం

సూర్యాపేట, ఆలేరు మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు బెడిసికొట్టాయి. సూర్యాపేటలో అవిశ్వాసానికి చివరి నిమిషలో ఓ కౌన్సిలర్ దూరంగా ఉండటంతో వీగింది. ఆ తరువాత 15 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం 24కు చేరి మెజార్టీ సాధించింది. అయితే మరోసారి అవిశ్వాసానికి తావులేకపోవడంతో నిధుల కేటాయింపులు, అభివృద్ధి విషయంలో వార్డుల మధ్య సమతుల్యత ఉంటుందనే అభిప్రాయం పార్టీ మారిన కౌన్సిలర్లలో వ్యక్తమవుతోంది. ఆలేరులోనూ అవిశ్వాసం వీగింది. దీంతో ఈ రెండు మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్ చైర్‌పర్సన్లే పూర్తి పదవీ కాలం కొనసాగనున్నారు.

18 నుంచి ఆరుకు పడిపోయిన బీఆర్ఎస్ బలం

ఉమ్మడి జిల్లాలో 19కి 18 మునిసిపాలిటీల్లో గులాబీజెండా ఎగురవేసిన బీఆర్ఎస్, అసెంబ్లీ ఎన్నికల తరువాత వాటిని నిలబెట్టుకోలేకపోయింది. దూకుడు మీద ఉన్న కాంగ్రెస్ ఒక్కో మునిసిపాలిటీని క్రమంగా తన ఖాతాలో వేసుకుంటూ వస్తుండగా, చిరికి బీఆర్ఎస్‌కు మిర్యాలగూడ, సూర్యాపేట, తిరుమలగిరి, నకిరేకల్, చండూరు, ఆలేరు, భూదాన్‌పోచంపల్లి మాత్రమే మిగిలాయి. వీటిల్లోనూ తిరుమలగిరిలో రేపో, మాపో అవిశ్వాసం ప్రవేశపెడతారనే చర్చసాగుతుంటే, మిగిలిన వాటిల్లో నకిరేకల్ పాలకవర్గానికి నాలుగేళ్ల గడువు ఇంకా పూర్తికాకపోవడంతో ఇక్కడ అవిశ్వాసానికి ఛాన్స్ లేదు. సూర్యాపేట, ఆలేరులో ఇప్పటికే అవిశ్వాసం వీగడంతో ఈ ఇద్దరు బీఆర్ఎస్ చైర్మన్లు పూర్తిపదవీకాలం కొనసాగుతారు. మిగిలిన మిర్యాలగూడ, చండూరు, భూదాన్‌పోచంపల్లిల్లో మాత్రం అవిశ్వాసాలపై ఎలాంటి కార్యాచరణ లేదు.

వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులకు మోక్షం

- నాలుగేళ్ల తరువాత మంజూరు చేసిన కేంద్రం
- 2019నుంచి నిలిచిన ఐహెచ్‌హెచ్‌ఎల్ బిల్లులు
- జిల్లాలో 2,340 మరుగుదొడ్లకు రూ.1.87కోట్లు
- రెండు విడతల్లో బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ



యాదాద్రి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు బిల్లుల మంజూరు కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తుండగా, ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం వాటిని మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో జిల్లా అధికారులు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు వాటిని చెల్లించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతీ కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండాలనే లక్ష్యంతో కేంద్రం స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించింది. వాటి నిర్మాణాన్ని ఈ పథకం కింద చేర్చింది. అందుకు ఇండివిజ్యువల్ హౌస్‌హోల్డ్ లెట్రిన్ (ఐహెచ్‌హెచ్‌ఎల్) అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ పథకం కింద మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు కేంద్రం రూ.12,000 సాయంగా అందించనుంది. జిల్లాలో 2014-2018వరకు మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించగా, ఆతరువాత నిధులు మంజూరు కాలేదు. అయితే పెండింగ్‌లో ఉన్న బిల్లులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కాగా, గతంలో కొంతమంది లబ్ధిదారులకు రూ.6,000 మంజూరయ్యాయి. జిల్లాలోని మొత్తం 17 మండలాల్లో 2,340 మరుగుదొడ్లకు రూ.1,87,62,397వరకు చెల్లించనున్నారు.

మండలం	మరుగుదొడ్లు	చెల్లించాల్సిన మొత్తం
అడ్డగూడూరు	307	రూ.26.3లక్షలు
ఆలేరు	212	రూ.14.5లక్షలు
ఆత్మకూరు	105	రూ.8.12లక్షలు
భువనగిరి	215	రూ.19.28లక్షలు
బీబీనగర్	113	రూ.6.82లక్షలు
బొమ్మలరామారం	127	రూ.9.85లక్షలు
చౌటుప్పల్	53	రూ.3.63లక్షలు
గుండాల	215	రూ.16.5లక్షలు
తుర్కపల్లి	66	రూ.7.44లక్షలు
మోటకొండూరు	87	రూ.5.49లక్షలు
మోత్కూరు	168	రూ.12.26లక్షలు
నారాయణపూర్	134	రూ.15.63లక్షలు
పోచంపల్లి	18	రూ.97,240
రాజపేట	129	రూ.10.53లక్షలు
రామన్నపేట	19	రూ.64,800
వలిగొండ	288	రూ.22.80లక్షలు
యాదగిరిగుట్ట	84	రూ.7.8లక్షలు

గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తున్నాం

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఐహెచ్‌హెచ్‌ఎల్ బిల్లులు చెల్లించేందుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. గ్రామాల్లో ఎంపీడీవో, ఏపీవో, గ్రామపంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో వ్యక్తిగత మరుగుదొడ్లను తనిఖీ చేస్తున్నారు. వాటికి సంబంధించిన ఫొటోలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం. కేంద్ర ప్రభుత్వం రెండు విడతలుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.12,000 జమ చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా 2019 నుంచి మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల జాబితాను రూపొందించి, వాటిని పరిశీలిస్తున్నారు.

- నాగిరెడ్డి, డీఆర్‌డీవో

మరుగుదొడ్ల పరిశీలన

గ్రామీణ ప్రాంతాల్లో ఐహెచ్‌హెచ్‌ఎల్ పథకం కింద నిర్మించుకున్న మరుగుదొడ్లను పరిశీలించేందుకు ఓ ప్రత్యేక బృందాన్ని జిల్లా అధికారులు నియమించారు. ఈ బృందంలో ఎంపీడీవో, ఏపీవో, పంచాయతీ కార్యదర్శి ఉంటారు. డీఆర్డీవో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. బృందం సభ్యులు పెండింగ్‌లో ఉన్న బిల్లు చెల్లింపునకు సంబంధించిన వివరాలు గ్రామాల్లో సేకరిస్తారు. నిర్మాణం పూర్తయిన మరుగుదొడ్ల ఫొటోలను తీసుకుని వెబ్‌పోర్టల్‌లో అప్‌డేట్ చేస్తారు. లబ్ధిదారుడి వివరాలు, ఆధార్, బ్యాంకు ఖాతా పాస్‌పుస్తకాల జిరాక్స్ కాపీలు తీసుకుంటారు. అనంతరం నేరుగా లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాల్లో రూ.12,000 రెండు విడతల్లో జమ చేస్తారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి



కలెక్టర్ హనుమంతు కే.జెండగే

మోత్కూరులో ప్రేరణ తరగతుల్లో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

మోత్కూరు, ఫిబ్రవరి 17: విద్యార్థులు తమకంటూ ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని మధ్యలో వదిలివేయకుండా కష్టపడి చదివి గమ్యం చేరుకోవాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. శనివారం మోత్కూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు వసతిగృహ విద్యార్థులకు, మోత్కూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ, అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న, చిన్న సమస్యలను అతిగా ఊహించుకోవద్దన్నారు. నెగెటివ్ ఆలోచనలను పక్కనబెట్టి పాజిటివ్ ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. చదువుపై శ్రద్ధ పెట్టాలని, పరీక్షలు దగ్గర పడుతున్నందున పుస్తకం మొత్తం చదవకుండా ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఇప్పుడు కష్టపడి చదివితే నే భవిష్యత్‌లో పేరు, ప్రఖ్యాతులు పొందుతారని, జీవితంలో సుఖఃపడతారన్నారు. ప్రపంచలోనే అత్యంత ధనవంతుడైన ఎలాన్‌మస్క్, ఒలింపిక్స్‌లో 28 బంగారు పతకాలు సాధించిన స్విమ్మర్ మైఖేల్ ఫేల్ప్స్ విజయ గాథలు చెప్పి వారిలో స్ఫూర్తినింపారు. స్విమ్మర్ తన చేయి విరిగినా తన సాధన మానకుండా విజయపరంపర కొనసాగించారన్నారు. మీపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని, మీ జీవితాన్ని తీర్చిదిద్దడంకోసం వారు కష్టపడుతూ మిమ్ములను చదవిస్తున్నారని, మీరు ఇష్టంతో కష్టపడి చదివి వారి కలలు పండించాలన్నారు. డీసీపీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ అన్నిరంగాల్లో స్పీడ్ పెరుగుతున్నట్టుగానే మనిషిలో అసహనమూ పెరిగిందన్నారు. ఇంటర్నెట్‌లో మంచీ, చెడు రెండూ ఉంటాయని, మంచిని స్వీకరించి, చెడును వదిలేయాలన్నారు. ఒంటరిగా ఉండకుండా 10 మందితో కలిసి మాట్లాడాలని, విషయ పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా అవసరమని, వారికి తెలియని ఎన్నో విషయాలు ఆటలు నేర్పిస్తాయన్నారు. ఆటల ద్వారా ఫిట్‌నెస్, ఎనర్జీ, ఏకాగ్రత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఓటమిని జీర్ణించుకునే శక్తి పెరుగుతాయన్నారు. మీమీద మీకు నమ్మకం ఉన్నప్పుడే దేన్నైనా సాధించగలుగుతారన్నారు. ఇంపాక్ట్ వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంప నాగేశ్వరావు విద్యార్థుల్లో ప్రేరణ కల్గిస్తూ, పరీక్షలంటే భయం లేకుండా, చిన్న విషయాలకు కుంగిపోకుండా ఉండేలా పలు అంశాలపై అవగాహన కల్పించారు. డీఈవో కె.నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, బీసీ, సాంఘిక సంక్షేమ శాఖల జిల్లా అధికారులు యాదయ్య, జయపాల్‌రెడ్డి, ఎంఈవో శ్రీధర్, హెచ్‌ఎం. టి.గోపాల్‌రెడ్డి, వసతి గృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెరగాలి



క్రప్రాయిపల్లిలో వివరాలు అడుగుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 17: ఉపాధి హామీ పనుల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి పని కల్పించి, కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి ఉపాధి ఆదేశించారు. మండలంలోని క్రప్రాయిపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వీరారెడ్డి శనివారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు వంద రోజులు పని కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని, గ్రామ అవసరాలను బట్టి పనులను గుర్తించాలని, అధిక శాతం కూలీలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. గ్రామంలో ఎంతమంది కూలీలకు పని కల్పిస్తున్నారని ఫీల్డు అసిస్టెంట్ నర్మదను అడిగారు. గ్రామంలో ఇంటి పన్నులు, నల్లా బిల్లుల వసూలు ఎలా ఉన్నాయని పంచాయతీ కార్యదర్శి సహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీలో మొక్కలను పరిశీలించి మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

వచ్చేనెల 9న జాతీయ లోక్ అదాలత్

- రాజీ మార్గంలో 5వేలకు పైగా పరిష్కారం లక్ష్యం
- వ్యాధుల కారకాలను నియంత్రించాలి
- హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించే ప్రయత్నాలు
- జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జయరాజు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 17: కేసులను సత్వరంగా పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేసే లక్ష్యంతో వచ్చే నెల 9న జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయాధికారి ఏ.జయరాజు అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కోర్టులలో 20వేలకుపైగా కేసుల విచారణ కొనసాగుతున్నాయని, వీటిలో 7,718 సివిల్, 4,115 క్రిమినల్ కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు అనువుగా ఉన్నట్లు తెలిపారు. అయితే మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో 3,066 క్రిమినల్, సివిల్ కేసులు, 1,815 ట్రాఫిక్ చలానా, ఇతర జరిమానా చెల్లింపుల కేసులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం పోలీస్, తదితర శాఖలతో త్వరలో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న మీడియా కూడా జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రాజీమార్గంలో కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు. చట్టాలు, హక్కులు, బాధ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎయిమ్స్ సహకారంతో కోర్టు ఆవరణలోనే నిర్వహించిన క్యాన్సర్‌డేలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. మారుతున్న జీవన శైలి, వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణం అవుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమాల్లో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతీదేవి, ప్రధాన జూనియర్ సవిల్ జడ్జి బి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగారం అంజయ్య, రాజశేఖర్‌రెడ్డి, ఎయిమ్స్ వైద్యురాలు డాక్టర్ వాహిని, డాక్టర్ అనిల్, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఎం సమర్థ్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వీవర్స్ సర్వీస్ సెంటర్ ఏడీ పుగులెంతి

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 17: చేనేత కార్మికుల్లో వృత్తి నైపుణ్యం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సమర్థ్ యోజన పథకాన్ని చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా భారత ప్రభుత్వ అనుబంధ సంస్థ వీవర్స్ సర్వీస్ సెంటర్ ఏడీ ఎస్. పుగులెంతి కోరారు. కేంద్ర ప్రభుత్వంఅమలు చేస్తున్న పీఎం సమర్థ్ యోజనపథకం ద్వారా భూదాన్‌పోచంపల్లిలోని శ్రీరంజన్ సిల్క్సుఇండస్ట్రీలో కార్మికులకు చేనేతవృత్తిలో రంగులఅద్దకం (డైయింగ్) ప్రక్రియలో శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చేనేత వృత్తిలోని కార్మికులు తమ నైపుణ్యాన్ని పెంచేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మారుతున్న కాలానుగుణంగా చేనేత ఉత్పత్తుల్లో నాణ్యత, నవ్యత ఉండాలని, ఆధునిక డిజైన్లు రూపొందించాలన్నారు. చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలోని డయింగ్ ప్రక్రియలోని నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్మికులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీవర్స్ సర్వీస్ సెంటర్ టెక్నికల్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్, శ్రీరంజన్ సిల్క్సు ఇండస్ట్రీస్ యజమాని ఎన్నం శివకుమార్, మాస్టర్ ట్రైనర్, చేనేత కళాకారుడు బోగ బాలయ్య, కార్మికులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులకు పీఎం సమర్థ్ యోజన శిక్షణ కార్యక్రమంలో ఏడీ పుగులెంతి

రేపు వెల్లంకికి గవర్నర్ తమిళిసై రాక

విఠలాచార్య గ్రంథాలయాన్ని ప్రారంభించనున్న సౌందర రాజన్



వెల్లంకి గ్రామంలోని ఆచార్య కూరెళ్ల గ్రంథాలయంలోని పుస్తకాలు

రామన్నపేట ఫిబ్రవరి 17: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం ఉదయం 11 గంటలకు రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి రానున్నారు. ప్రముఖ సాహితీవేత్త, కవి, రచయిత, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య తన సొంత ఇంటిని గ్రంథాలయంగా మార్చి నూతనంగా నిర్మించిన ఆచార్య కూరెళ్ల భవనాన్ని ఈ నెల 19న ఉదయం 11గంటలకు గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ప్రారంభించనున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య తదితరులు పాల్గొననున్నారు. రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన ఈ గ్రంథాలయంలో 2లక్షల పైచిలుకు పుస్తకాలు ఏర్పాటు చేశారు. గ్రంథాలయ నూతన భవనం, పైఅంతస్తులో సభా మందిరం ప్రారంభంతోపాటు కూరెళ్ల విఠలాచార్య రచించిన విఠలేశ్వర శతకాన్ని ఆవిష్కరించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు కూరెళ్ల నరసింహాచారి తెలిపారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా నల్లగొండ జిల్లా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరవుతారని చెప్పారు. సదస్సులో 'సమాజం-గ్రంథాలయాలు' అంశంపై కవి ఏనుగు నరసింహరెడ్డి, పరిశోధనా గ్రంథాలయంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణ కౌండిన్య, దాసోజు పద్మావతి ప్రసంగిస్తారని చెప్పారు.

గవర్నర్ రాక ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో

రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ రాక సందర్భంగా సభా ఏర్పాట్లను చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి శనివారం గ్రామాన్ని సందర్శించి పనులను పరిశీలించారు ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెల్ల విఠలాచార్యను సత్కరించారు. సభా స్థలాన్ని, నూతన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాల్ బహదూర్, లయన్స్ క్లబ్ సభ్యులు గోవర్ధన్‌చారి, అడ్వకేట్ గోవర్ధన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 17: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ సీఐ రాజశేఖర్ విలేక రుల సమావేశంలో శనివారం వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని జమ్మిగడ్డ ప్రాంతంలోని జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పక్కనే ఉన్న రాజీవ్ పార్కులో అనుమానంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. పెన్‌పహాడ్ మండలం మాచవరం గ్రామానికి చెందిన బొమ్మగంటి గోపి, ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల గ్రామానికి చెందిన దండిగ ప్రసాద్, సూర్యాపేట పట్టణంలోని కస్తూరిబజార్‌కు చెందిన తులసీ సాయికిరణ్‌లు ముగ్గురు స్నేహితులు. బొమ్మగంటి గోపి ఒరిస్సా ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి స్నేహితులతో కలిసి పీల్చుతూ మిగిలిన గంజాయిని పట్టణంలోని పలు కాలేజీలు, ఇతర వ్యక్తులకు విక్రయించేవారు. ఇదే క్రమంలో శనివారం గోపి గంజాయిని తీసుకొని వచ్చి రాజీవ్‌పార్కు వద్ద దండిగ ప్రసాద్, తులసీ సాయికిరణ్‌కు ఇచ్చే క్రమంలో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయితో పాటు రెండు బైకులు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పట్టణ ఎస్ఐలు బాలకృష్ణ, లోకేష్, సిబ్బంది ఆనంద్, వెంకటేష్ పాల్గొన్నారు

దైవదర్శనానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 17: దైవదర్శనానికి వెళ్లి వస్తూ ఓ మహిళ తిరిగిరాని లోకాలకు వెళ్లింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్పీ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం బొమ్మేపల్లి గ్రామానికి చెందిన దాసరి కోటేష్, లక్ష్మమ్మ(28) దంపతులు తమ కుమారుడు శివతో కలిసి శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వెళ్లారు. స్వామి వారి దర్శనం అనంతరం మధ్యాహ్నం చెర్వుగట్టు నుంచి స్వగ్రామమైన బొమ్మేపల్లికి బయలుదేరారు. మార్గమధ్యలో నల్లగొండ పట్టణంలోని ఆర్పీ రోడ్డులోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న లక్ష్మమ్మ టిప్పర్ టైర్ల కిందపడగా భర్త కోటేష్, కుమారుడు శివ మరోవైపు పడిపోయారు. ప్రమాదంలో టైర్ల కింద పడిన లక్ష్మమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, భర్త కుమారుడికి స్వల్పగాయాలయ్యాయి. మృతురాలి సోదరుడు జానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

- బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

- ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

- దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ
- ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై షైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్.. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై షైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా... సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై షైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

- 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన
- కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్లు కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్‌నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్ రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

- కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన
- వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

కాళేశ్వరం కుంగితే ఎలా సమర్థించుకుంటారు?

● శాసనసభలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు నాలుగు పిల్లర్లు కుంగితే ఏమవుతుందన్న కేసీఆర్... అసలు కుంగిన విషయాన్ని ఎలా సమర్థించుకుంటారని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ప్రశ్నించారు. నదీ జలాల విషయంలో నల్లగొండకు తీవ్ర అన్యాయం చేసిందే కేసీఆర్ అని మండిపడ్డారు. జిల్లా ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై శాసనసభలో జరిగిన చర్చలో బాలునాయక్ మాట్లాడారు. కేసీఆర్ సర్కారు రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని ఆరోపించారు. కేవలం దళితుల ఓట్లను దండుకునేందుకు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. సాగుచేస్తున్న రైతులకు రైతు భరోసా ఇస్తామని, భూస్వాములకు బంద్ చేస్తామన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బాగుందన్నారు.

సీపీఆర్ చేసి కోతి ప్రాణాలు కాపాడిన యువకుడు



సూర్యాపేటరూరల్, ఫిబ్రవరి 17: కోతికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం కాసరబాద గ్రామానికి చెందిన యువకులు. మండల పరిధిలోని కాసరబాద గ్రామంలో శనివారం కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి కోతి విద్యుదాఘాతంతో కిందపడి అపస్మారకస్థితిలో పడిపోయింది. అటుగా వెళ్తున్న గ్రామానికి చెందిన పోలగాని రాము, కారింగుల సతీష్ కలిసి అపస్మారకస్థితిలో ఉన్న కోతికి సీపీఆర్ చేయడంతో కోతి ప్రాణాలతో బయటపడింది. సీపీఆర్‌పై అవగాహన ఉండడంతో కోతి ప్రాణాలు కాపాడగలిగామని ఆ యువకులు ఆనందం వ్యక్తం చేశారు.

బాలిక మృతిపై డీఎంహెచ్‌వో విచారణ

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 17: తొమ్మిదేళ్ల బాలిక కాలుకు శస్త్రచికిత్స నిర్వహించేందుకు ఇచ్చిన మత్తుమందు వికటించి మృతిచెందిన సంఘటనపై జిల్లా వైద్యాధికారి కొండల్‌రావు విచారణ జరిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం రెడ్డికాలనీలోని శ్రీసాయి ఆర్థోకేర్ ఆస్పత్రిని శనివారం తనిఖీ చేసి బాలికకు అందించిన వైద్యసేవలపై ఆరాశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శస్త్రచికిత్సకు ముందు ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్ డాక్టర్ స్వయంగా బాలికకు మత్తుమందు ఇచ్చినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. అనస్తీషియా పర్యవేక్షణలో మత్తుమందు ఇవ్వాల్సి ఉండగా, అలాంటి జాగ్రత్తలేవి వైద్యుడు పాటించలేదని, మోతాదుకు మించి మత్తుఎక్కించడంతో బాలిక కోమాలోకి వెళ్లిమృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. సంఘటనపై ఆస్పత్రి డాక్టర్ శ్రీనివాసరాజు వాంగ్మూలాన్ని సేకరించిన్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. విచారణలో గుర్తించిన అంశాలపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు.

శాస్త్రోక్తంగా పాతగుట్ట అధ్యయనోత్సవాలు

● రాత్రివేళ నమ్మాళ్వార్ పరమపదోత్సవం ● లక్ష్మీనృసింహుడికి వైభవంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 17: పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం మూడో రోజు వార్షిక అధ్యయనోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. పాతగుట్ట ప్రధానాలయంలో కొలువుదీరిన స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన ఆచార్యులు లక్ష్మీనృసింహుడికి, ఆళ్వార్లను కొలుస్తూ నవకలశ స్నపన తిరుమంజనాలు నిర్వహించారు. ఆలయ ప్రాశస్త్యం కోసం నిర్వహించే అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వయంభూ లక్ష్మీనృసింహుడిని, ఆళ్వార్లను సేవల్లో తీర్చిదిద్ది పొరపాట్లు సేవోత్సవం నిర్వహించారు. అలంకార సేవ ముందు అర్చకబృందం, రుత్వికులు దివ్య ప్రబంధ వేదపఠనం చేశారు. రాత్రివేళ పరమపదోత్సవ ఘట్టాలు నేత్రపర్వంగా సాగాయి. అధ్యయనోత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న నమ్మాళ్వార్ పరమపదోత్సవ ఘట్టాలను సంప్రదాయరీతిలో నిర్వహించారు. ఆళ్వారాచార్యుల తిరునక్షత్ర వేడుకల్లో భాగంగా ఆళ్వార్లు అందించిన దివ్య ప్రబంధ పాశుర పఠనాలతో సేవోత్సవం నిర్వహించడం సంప్రదాయం. శ్రీవైష్ణవ దేవాలయాల్లో అధ్యయనోత్సవాల పరిసమాప్తికి ముందు రోజున పరమ భక్తాగ్రేసుడు, ఆళ్వారాచార్యులు నమ్మాళ్వార్ పరమపదోత్సవం నిర్వహించడం ఆచారం. శ్రీమన్నారాయణుడి పాదాల అంశతో భువిలో ఆవిర్భవించిన నమ్మాళ్వార్ పరమపదం పొంది, తిరిగి భగవానుడి సన్నిధిని చేరే వైదిక ఘట్టాలను అర్చకులు, రుత్వికులు, వేద పండితులు నేత్రపర్వంగా నిర్వహించారు.



అలంకార సేవ ముందు వేదపఠనం చేస్తున్న అర్చకబృందం

లక్ష్మీనృసింహుడికి వైభవంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శనివారం నిత్యకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగింది. కొండపైన ప్రధానాలయ అష్టభుజి ప్రాకార దక్షిణ దిశలోని కల్యాణమండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది సేవోత్సవం జరిపి విశ్వక్సేనుడికి తొలి పూజలతో కల్యాణ తంతు నిర్వహించారు. ముందుగా ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, సుదర్శన నారసింహ హోమ పూజలు నిర్వహించారు. శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఇదిలా ఉండగా స్వామికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన మొక్కుకానుకలను ఈ నెల 20వ తేదీన లెక్కించనున్నట్టు దేవస్థాన ఈవో రామకృష్ణారావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.21,40,358 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.



అలంకార సేవను తిరువీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు

పీవోడబ్ల్యూ సంధ్య భర్త అంత్యక్రియలు పూర్తి

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 17: ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ సంధ్య భర్త, హైదరాబాద్‌లోని నవ్య ప్రింటింగ్ ప్రెస్ యజమాని రామకృష్ణారెడ్డి అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో కన్నీటి వీడ్కోల నడుమ ముగిశాయి. రామకృష్ణారెడ్డి అంత్యక్రియలను శనివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడలోని వారి వ్యవసాయ క్షేత్రంలో పూర్తిచేశారు. రామకృష్ణారెడ్డి భౌతికకాయంపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ పూలమాలలువేసి నివాళులర్పించి సంధ్య, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి రమేష్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి, పీడబ్ల్యూవో రాష్ట్ర కార్యదర్శి సుభద్ర, ఏపీ రాష్ట్ర నాయకురాలు పద్మ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ఆత్మవిశ్వాసంతో అనుకున్నది సాధించాలి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 17: ఆత్మవిశ్వాసంతో అనుకున్న లక్ష్యాలు సాధించాలని ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి, యంగెస్ట్ పీహెచ్‌డీ హోల్డర్, మోటివేషన్ స్పీకర్ డాక్టర్ నైనా జైశ్వాల్ అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో శనివారం ఏర్పాటుచేసిన మోటివేషన్ కార్య కమంలో మాట్లాడారు. కఠోర సాధన చేస్తేనే ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతామన్నారు. ఆవేశానికిలోను కావొద్దన్నారు. యువత చెడు మార్గాల్లో పయనించవద్దన్నారు. దేశంలో ఆడపిల్లలకు ఎంతో ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉందని, ఆడపిల్ల ఆదిపరాశక్తి అన్నారు. సమాజంలో గెలుపుకన్నా ఓటమి ఎంతో గొప్పదని, ఓటమి మనిషిని ఉన్నత స్థాయిలో నిలబెడుతుందని అసిస్టెంట్ కమిషనర్ పిన్నని సందీప్‌భాగా అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు సాధించాలంటే క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు భయపడుతూ పరీక్షా కేంద్రాలకు పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌వుడ్ చైర్మన్ తుమ్మా మల్రెడ్డి, డైరెక్టర్ సరితారెడ్డి, కృష్ణారావు, రాజారెడ్డి, నైనా అగస్త్య, అశ్వినికుమార్, భాగ్యలక్ష్మీ, పిన్నని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చచ్చిపోలేక... బతికున్నాం

● కుమారుడు, కోడలు వేధిస్తున్నారు: తల్లిదండ్రులు ● అప్పులు తీర్చేందుకు అప్పులపాలయ్యా: కుమారుడు ● హైకోర్టును ఆశ్రయించిన తండ్రి

సూర్యాపేట, ఆత్మకూరు(ఎస్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి ఆస్తిని కుమారుడు అక్రమంగా అతడి పేరు మీదకు మార్చుకుని వీధిన పడేశాడని ఓ తండ్రి ఆందోళన.. చెల్లెళ్ల పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులను తీర్చేందుకు తాను అప్పులపాలయ్యానని, వారసత్వంగా వచ్చిన ఆస్తిని విక్రయించి బయటపడాలని కుమారుడి ఆవేదన.. వృద్ధులైన తమకు న్యాయం చేయాలని తండ్రి హైకోర్టును ఆశ్రయించాడు. ఆ తండ్రీకుమారుల ఘర్షణ ఉదంతానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం శంకన్నగూడేనికి చెందిన సామ పాపిరెడ్డి, సుగుణమ్మ దంపతులకు ఐదుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పాపిరెడ్డి తన కుమారుడికి, కుమార్తెలందరికీ వివాహం చేశాడు. వివాహాల కోసం అప్పులయ్యాయి. కుమారుడు శంకర్‌రెడ్డి అందరిలో పెద్దవాడు. కాగా, పాపిరెడ్డి తనకున్న 2.10ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించాడు. 1986లో పదో తరగతి ఫెయిల్ కావడంతో శంకర్‌రెడ్డి జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. ఆయనకు భార్య భవానీతో పాటు కుమారుడు, కుమార్తె కాగా ఏడేళ్ల క్రితం కుమారుడు చనిపోయాడు. కుటుంబ అవసరాలు, బంధువుల పెళ్లిళ్ల ఇతర అవసరాల కోసం శంకర్‌రెడ్డి స్వగ్రామానికి అప్పుడప్పుడు వచ్చి వెళుతుండేవాడు. 40ఏళ్ల కిందటే హైదరాబాద్‌కు వెళ్లిన శంకర్‌రెడ్డికి అక్కాచెల్లెళ్లతో పెద్దగా సత్సంబంధాలు లేవు. పెద్ద కుటుంబం కావడం, ఐదుగురు ఆడపిల్లల పెళ్లిళ్ల వగైరా ఖర్చులతో కొంత రుణభారం ఏర్పడింది. వృద్ధాప్యంలో ఉన్న పాపిరెడ్డి దంపతులు వ్యవసాయం చేయడం కష్టంగా ఉందని ఉన్న భూమిని సాగుచేసుకుంటూ రుణభారం తీర్చి తమకు భుక్తం ఇవ్వాలని కుమారుడిని కోరారు. వ్యవసాయంలో అనుభవం లేని కుమారుడు శంకర్‌రెడ్డి కొద్దిపాటి వ్యవసాయంతో తన కుటుంబాన్ని, తల్లిదండ్రులను సాకడం కష్టమని తండ్రికి చెప్పాడు. ఇరువురూ పెద్దలను ఆశ్రయించగా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను కుమారుడు పోషించాలని పెద్దలు సూచించారు. రెండు ఎకరాల వ్యవసాయ భూమితో పోషణ కష్టమని కుమారుడు శంకర్‌రెడ్డి తిరిగి హైద్రాబాద్‌కు వెళ్లిపోయాడు. దాంతో పాపిరెడ్డి పోలీసులకు, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.

నాకు తెలియకుండా పట్టా చేయించుకున్నాడు: పాపిరెడ్డి

శంకన్నగూడెంలో నాకున్న 2.10 ఎకరాల భూమిని కుమారుడు నాకు తెలియకుండా పట్టా చేయించుకున్నాడు. 55ఏళ్లుగా సేద్యం చేస్తున్నా. వృద్ధాప్యంలో కుమారుడు నన్ను బాధపెడుతున్నాడు. నా ఇంటిని కూల్చివేశాడు. అనేకసార్లు కుమారుడు శంకర్‌రెడ్డి, కోడలు భవాని నన్ను, నా భార్యను కొట్టారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. రెవెన్యూ అధికారులు కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. చచ్చిపోలేక బతికున్నాం.. కుమారుడు, కోడలు వేధిస్తున్నారు. కేవలం వృద్ధాప్య పింఛన్ మీదే బతుకుతున్నాం. నేను పేద వాడినే కాక చదువురాని వాడిని. అందరి పెళ్లిళ్లు చేశా. నా కుమారుడు శంకర్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి హైదరాబాద్‌లో మూడంతస్తుల భవనం నిర్మించుకోగా, ప్రతి నెలా రూ.50వేల అద్దె కూడా వస్తుంది. కోడలు మహిళా మండలిలో లీడర్‌గా పనిచేస్తుంది. గత ఏడాది మే నెలలో నా పొలాన్ని స్వాధీనం చేసుకుని, ఇతరులకు విక్రయించేందుకు కుమారుడు, కోడలు విఫలయత్నం చేశారు. ఈ ఘటనను నిలదీసినందుకు నాపై, కుమార్తెలపై దాడి చేయించాడు. సమీపంలో నివసిస్తున్న కుమార్తె వచ్చి ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించింది. కుమారుడు, కోడలు దౌర్జన్యం నుంచి కాపాడి నా భూమిని, నా ఇంట్లో ఆక్రమించుకున్న పోర్షన్‌ను అప్పగించాలి.

అప్పులు చేసి నాపై నెట్టారు: శంకర్‌రెడ్డి

తండ్రి పాపిరెడ్డి అప్పులు చేసి నాపై నెట్టాడు. భూమిని తీసుకుని అప్పులు తీర్చి బాధ్యత తీసుకోవాలని చెప్పాడు. తనపై 2016లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ క్రమంలో ఎస్ఐ బాలునాయక్, స్థానిక పెద్దమనుషులు తనను, నా తండ్రిని పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. భూమి బదలాయిస్తున్నందుకు తండ్రికి భుక్తం కింద రూ.4 లక్షలు ఇచ్చేట్లు పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఆ మేరకు రూ.2 లక్షలు చేతికి, రూ.2లక్షలు జాయింట్(తండ్రీకుమారుల పేరుమీద) అకౌంట్‌లో వేసి వాటిపై వచ్చే వడ్డీని నేరుగా తండ్రి ఖాతాలో వేసేట్లు ఏర్పాట్లు చేశా. భూమి విక్రయించగా వచ్చిన వారికి తండ్రి అడ్డుచెప్పటంతో గత ఏడాది మే 26న రూ. 12 లక్షలు ఇచ్చేలా, మళ్లీ వివాదం రావటంతో గత నెల 17వ తేదీన ఆర్డీవో కౌన్సిలింగ్ అనంతరం రూ.14 లక్షలు తల్లిదండ్రులకు ఇచ్చేందుకు తీర్మానం చేసుకున్నాం. అయినప్పటికీ తండ్రి వినడంలేదు. ఈ నేపథ్యంలో పోలీస్‌స్టేషన్‌లో, ఆర్డీవోకు తనపై ఫిర్యాదు చేశాడు.

కౌన్సెలింగ్ చేసి పంపాం: సీహెచ్ కృష్ణయ్య, ఆర్డీవో

శంకన్నగూడెంకు చెందిన సామ పాపిరెడ్డి గతేడాది డిసెంబరులో తన కుమారుడు శంకర్‌రెడ్డి తన భూమిని తనకు తెలియకుండా పట్టా చేసుకున్నాడని, తనకు భుక్తం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశాడు. జనవరి 17న ఇరువురికి నోటీసులు అందజేసి కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చాం. తండ్రి పాపిరెడ్డి కుమారుడి నుంచి రూ.14లక్షలు ఆశించగా రూ.10 లక్షలు ఇద్దరి పేరున బ్యాంకు డిపాజిట్ చేయాలని మిగతా రూ.4 లక్షలు చేతికి ఇవ్వాలని, వారిద్దరూ వారి వెంట వచ్చిన వారితో మాట్లాడుకుని ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత పాపిరెడ్డి నుంచి కానీ శంకర్‌రెడ్డి నుంచి ఫిర్యాదులు అందలేదు.

పెద్దమనుషుల సమక్షంలో తీర్మానం చేసుకున్నారు: ఎస్ఐ వెంకటరెడ్డి

ఈ ఏడాది జనవరి 2న శంకన్నగూడెం గ్రామానికి చెందిన సామ పాపిరెడ్డి, కుమారుడు సామ శంకర్‌రెడ్డి, కోడలు భవానీ తనపై దాడి చేశారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఆ ఫిర్యాదు మేరకు శంకర్‌రెడ్డి, భవాని వారి బంధువులు ఏనుగు నాగిరెడ్డి, శంభారెడ్డిలపై ఆత్మకూర్(ఎస్) పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశాం. జనవరి 17న ఆర్డీవో కార్యాలయంలో పెద్ద మనుషుల సమక్షంలో వారు సమస్య పరిష్కారానికి తీర్మానం చేసుకున్నారు.

కుల గణన బిల్లు చారిత్రాత్మకం



పూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ ఓబీసీ సెల్ కార్యకర్తలు, నాయకులు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 17: కుల గణన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపడం చారిత్రాత్మకమని కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ బెండ శ్రీకాంత్ అన్నారు. శనివారం కుల గణన బిల్లు ఆమోదం పొందడాన్ని హర్షిస్తూ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భువనగిరిలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కుల గణన ఆయా వర్గాల ప్రజల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. బిల్లు ఆమోదానికి కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బీసు కుంట్ల సత్యనారాయణ, గాజుల కుమార్, ఎండి.మజహర్, మల్లేశం, ఎడమ ప్రవీణ్, ఎండి ఫసీయోద్దీన్, రత్న రాజశేఖర్, సాల్వేరు ఉపేందర్, నల్ల కిషోర్, పానుగంటి నర్సింహ, ఎం.కుమార్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం



అధికారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 17: భువనగిరి ట్రాన్స్‌కో డీఈ కార్యాలయ ఆవరణలో అధికారులకు, సిబ్బందికి శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కార్పొరేట్ ఆసుపత్రి వైద్య బృందం గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేసి తీసుకోవాల్సిన చికిత్సలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ట్రాన్స్‌కో ఎస్‌ఈఐ శ్రీనాథ్, డీఈ మల్లిఖార్జున్, ఏడీ ఆనంద్‌రెడ్డి, ఏఈలు సాయికృష్ణ, సైదయ్య పాల్గొన్నారు.

చిన్న మేడారం టెండర్ నిర్వహణపై అధికారుల విచారణ

రాజాపేట, ఫిబ్రవరి 17: రాజాపేట మండలం చిన్నమేడారంలో టెండర్ల నిర్వాహణపై సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం అధికారులు విచారణ నిర్వహించారు. టెండర్ల నిర్వహణతో భక్తులకు ఇబ్బందులు కగులుతున్నాయని పలువురు పేర్కొన్నారు. టెండర్లు నిర్వహించింది. వాస్తవమేనని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు కల్పించిన వసతులు, నిర్వాహణ తదితర అంశాలను ఎంపీవో దినకర్ నిర్వాహకులను, భక్తులను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు విచారణ అధికారి దినకర్ తెలిపారు.

ఎమ్మెల్యే కుంభంను కలిసిన మునిసిపల్ కమిషనర్

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 17: ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని భువనగిరి మునిసిపల్ కమిషనర్ పి.రామాంజులరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా హైదరాబాద్‌లోని ఆయన ఇంటిలో కలిశారు. బదిలీపై ఇటీవలె వచ్చిన కమిషనర్ ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని నూతనంగా చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు రూపొందించాలని, పన్నులను చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నరేంద్రమోదీ మళ్లీ ప్రధాని కావడం ఖాయం



ఆత్మకూరు(ఎం): సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు మల్లేశం

ఆత్మకూరు(ఎం)/ఆలేరు రూరల్, ఫిబ్రవరి 17: దేశంలో 400 పార్లమెంట్ సీట్లు బీజేపీ గెలవడం, మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి మల్లేశం అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీని అత్యంత మెజార్టీతో గెలిపించాలని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సారథ్యంలో ఈనెల 20వ తేదీన తెలంగాణ 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీ విజయసంకల్ప యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడానికి పార్టీ గట్టి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20 తేదీన భువనగిరిలో యాత్ర ప్రారంభమై, 21న ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూరు(ఎం) మండలానికి చేరుకుంటుందని, అక్కడి నుంచి మోత్కూరుకు వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంత పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సంకల్ప యాత్రను విజవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు తడిసిన మల్లారెడ్డి, నాతి బిక్షపతి, తోపాటు బి.సత్యనారాయణ, బి.ఉప్పలయ్య, ఎం.బాల్‌నర్సయ్య, పాల్గొన్నారు.

● కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పడాల శ్రీనివాస్ కోరారు. శనివారం ఆలేరులో జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్సుయాత్ర యాదాద్రి నుంచి ప్రారంభమై ఆలేరుకు చేరుకుంటుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి చెందిన వారే ఎంపీలుగా గెలువబోతున్నారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులు దూసరి రాఘవేంద్ర, బడుగు జహంగీర్, బందెల సుభాష్, రాజు, మహేష్, శంకర్ ఉన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదం

గుండాల, ఫిబ్రవరి 17: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు గ్రామీణ ప్రాంతంలో క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ఈరసరపు యాదగిరిగౌడ్ సహకారంతో మోత్కూరు పాత తాలూక స్థాయి గ్రామీణ క్రీడోత్సవాలను శనివారం ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. క్రీడలు విద్యార్థులకు ఎంతో జీవిత పాఠాలను నేర్పుతాయని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొని మండల స్థాయితో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొని పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా అవసరమన్నారు. క్రీడలు శారీరక ధారుఢ్యానికి తోడ్పడుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పీఈటీలను నియమించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గుండాల ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం తక్షణమే తన నిధుల నుంచి రూ.10లక్షల వరకు వెచ్చిస్తానని తెలిపారు. అంతకు ముందు జాతీయ జెండాను ఎగురవేసి విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ తాండ్ర అమరావతి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎండి.కలీల్, తహసీల్దార్ కుమారి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసరపు యాదగిరి గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఏలూరిరాంరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ లింగాల భిక్షం, మండల కో ఆప్షన్ సభ్యుడు షర్ఫొద్దీన్, ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ పాల్గొన్నారు.



గుండాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

సమగ్రాభివృద్ధే లక్ష్యం

మోటకొండూర్ : నూతనంగా ఏర్పడిన మోటకొండూర్ మండల అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అభినందన సన్మాన సభలో పాల్గొని మాట్లాడారు. మండలం ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా మండలంలో ఎటువంటి ప్రభుత్వ పక్కా భవనాలు ఏర్పాటు చేయలేదని గత ప్రభుత్వం అసమర్థత వల్ల మండల అభివృద్ధి కుంటుపడిందని మండిపడ్డారు. మోటకొండూర్ మండలన్ని అన్ని విధల అభివృద్ధి చేసేందకు శాసనసభలో తన గళాన్ని వినిపించానని తెలిపారు. త్వరలోనే అధికారులతో సమీక్ష నిర్వహించి, మండలంలో రోడ్లు, రవాణ ప్రభుత్వ కార్యలయలు ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లకు స్థల సేకరణ చేపట్టి పక్క భవనాలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. మండలానికి రెండు నెలల్లోనే రెండు కోట్ల నిధులు మంజూరి చేశానని మరో కోటి మంజూరు చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో మాట తప్పకుండా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు యెల్లంల సంజీవరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు అనంతుల నవీన్‌రెడ్డి, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ కొంతం మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ స్వప్న సుబ్రమణ్యం, బోయిని ఝాన్సీ, బీర్ల శంకర్, మదార్‌గౌడ్, రఘునాథరాజు, మల్లేష్ యాదవ్, జంగారెడ్డి, భూమండ్ల శ్రీనివాస్, అకుల శ్రీనివాస్, కంకల ఏలేందర్, వంగాల మల్లేష్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు. మండలంలోని చాడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య ఉపకేంద్ర నిర్మానానికి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు విజయ్, మోసెస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్లంల సంజీవరెడి, పచ్చిమట్ల మదార్‌గౌడ్, చాడ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మోటకొండూర్: విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

తెలంగాణను తెచ్చిన ఘనుడు కేసీఆర్

● *బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల*



భువనగిరిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: తెలంగాణను తెచ్చిన ఘనుడు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. భువనగిరిలో నిర్వహించిన వేడుకల్లో రామకృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను తన పోరాట పటిమతో కేసీఆర్ నిజం చేశారన్నారు. కేక్ కట్ చేసిన అనంతరం జిల్లా ఆసుపత్రిలో బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు ఏవీ.కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, జనగాం పాండు, నీల్లా ఓం ప్రకాష్, మాజీ ఛైర్మన్లు ఎనబోయిన ఆంజనేయులు, పెంట నరసింహ , డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్, కొలుపుల అమరేందర్, గోమారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలేరులో డీసీసీబీ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ ఛైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పిత కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిన మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. మార్కెట్ వైస్‌ఛైర్మన్ బోరెడ్డి శ్రీనివాస్, నర్సింహులు, జింకల రామకృష్ణ, పంతం కృష్ణ, చంద్రకళ, కవిత, సంపత్, మహేశ్వరి ఉన్నారు. భూదాన్‌పోచంపల్లి పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశంయాదవ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీ, వైస్ ఛైర్మన్ బాత్క లింగస్వామియాదవ్, పీఏసీఎస్ ఛైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్‌లను అందజేశారు. పీఏసీఎస్ ఛైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ ఎండి.బాబాషరీఫ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ పాల్గొన్నారు. మోత్కూరులో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి, తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్‌రెడ్డి, కొండ సోంమల్లు, పాల్గొన్నారు. సంస్థాన్‌నారాయణపురం, మోటకొండూర్, అడ్డగూడూర్, రాజాపేట, బొమ్మలరామారం, గుండాల, ఆత్మకూరు(ఎం) మండల కేంద్రాల్లో కేకులు కట్‌చేశారు. పీహెచ్‌సీల్లో పండ్లు పంపిణీ చేశారు.

సంక్షిప్త సమాచారం...

చౌటుప్పల్ టౌన్ : భువనగిరిలో ఈ నెల 19న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మంద కృష్ణ మాదిగ హాజరవుతారని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

● విద్యారంగంలో పదో తరగతి ఎంతో కీలకమని, మంచి ఫలితాలను సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని శ్రీ గాయత్రీ విద్యా సంస్థల నిర్వాహకుడు బీమిడి సుభాష్‌రెడ్డి అన్నారు. స్థానిక శ్రీగాయత్రీ స్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. స్కూల్ ఇన్‌చార్జ్ త్రిపాల దేవి, హెచ్ఎం ఇంజనేయులు పాల్గొన్నారు.

● చౌటుప్పల్ పట్టణంలోని అమ్మా నాన్న అనాథాశ్రమంలో చేపట్టిన శివాలయం నిర్మాణం కోసం ప్రవాస భారతీయ కుటుంబం(ఆస్ట్రేలియా) కుర్రా రఘురామ్- హిమబిందు తన తండ్రి కుర్రా జయదేవ్‌బాబు ద్వారా రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన ఎన్ఆర్ఐ కుటుంబాన్ని ఆశ్రమ నిర్వాహకుడు జి.శంకర్ అభినందించారు.

అడ్డగూడూరు: మండలంలోని చిన్నపడిశాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సభ్యురాలు చుక్క యాకమ్మ ఇటీవల మృతి చెందడంతో రూ.రెండు లక్షల బీమా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు హైదరాబాదులో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ దర్శనాల అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు ఓర్సు పురుషోత్తం ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : కనకదుర్గాదేవి దేవాలయ పునర్నిర్మాణ, దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈనెల 20 నుండి 25 వరకు నిర్వహించనున్నట్లు ఆలయనిర్మాణ, విగ్రహ దాత ఏనుగు సురేందర్‌రెడ్డి, సుగందిని దంపతులు తెలిపారు. ఉత్సవాల కరపత్రాలను గ్రామ పెద్దలతో కలిసి విడుదల చేశారు.

మోత్కూరు : రాజన్నగూడెం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు సూదగాని లక్ష్మయ్య కుటుంబానికి టాడి కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.25వేల చెక్కు మంజూరైంది. ఆచెక్కును బీసీ సంక్షేమ జిల్లా అధికారి పి.యాదయ్య, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు లక్ష్మయ్య భార్య యాదమ్మకు అందజేశారు. లక్ష్మయ్య శనివారం మృతుని భార్య యాదమ్మకు అందజేశారు.

మోత్కూరు : మండలంలోని దాచారం గ్రామంలో కాంగ్రెస్ గ్రామశాఖ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా అండెం పిచ్చిరెడ్డి, బి.అయిలయ్య, అధ్యక్షుడిగా సూరారం నవీన్, ఉపాధ్యక్షుడిగా అంతటి సంతు, ప్రధాన కార్యదర్శిగా కడమంచి ఫకీర్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా తాటిపాముల మహేందర్ ఎన్నికయ్యారు.

భూదాన్‌పోచంపల్లి : లక్ష్మీనారాయణ ఆలయాన్ని నూతన కార్యవర్గం మరింత అభివృద్ధి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్ అన్నారు. పట్టణంలోని ప్రసిద్ధ లక్ష్మీనారాయణస్వామి దేవాలయం ఆవరణలో జరిగిన సమావేశానికి ఆయన మాట్లాడారు. లక్ష్మీనారాయణస్వామి దేవాలయం కమిటీ నూతన అధ్యక్షుడిగా అంకం వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చౌటుప్పల్ టౌన్ : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సంబంధం లేకుండా కాంగ్రెస్‌లో చేరినట్టుగా బీజేపీ నేత చలమల్ల కృష్ణారెడ్డి ప్రకటించుకోవడం అనైతికం, దుర్మార్గమని డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ లోని అసెంబ్లీ లాబీలో శనివారం మదర్ డెయిరీ మాజీ ఛైర్మన్ గంగుల కృష్ణా రెడ్డి తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 52 మందికి గుర్తింపు కార్డులను అందజేశారు. కార్డుల ద్వారా రైళ్లు, విమానాల్లో రాయితీ పొందవచ్చునని మండల శాఖ అధ్యక్షుడు కానుగుల వెంకటయ్య తెలిపారు.

మోత్కూరు : రాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వం కుల గణన చేయాలని తీర్మాణం చేయడం పట్ల బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2011 తర్వాత దేశంలో బీసీ జనాభా లెక్కలు తేల్చడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

ఉత్సాహంగా స్వపరిపాలన దినోత్సవం



దేదీప్య హైస్కూల్‌లో ఒకరోజు ఉపాధ్యాయులుగా విద్యార్థులు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 17: స్వపరిపాలన దినోత్సవాన్ని భువనగిరిలోని దేదీప్య హైస్కూల్‌లో శనివారం ఉత్సాహంగా నిర్వహించారు ఒకరోజు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించిన తీరు, తరగతులు నిర్వహణ, వస్త్రధారణ అందర్నీ ఆకర్షించాయి. ఉపాధ్యాయుడే సమాజ నిర్మాత అని తమ ఒక్కరోజు అనుభవంలో తెలుసుకున్న నిజమని ఉపాధ్యాయులైన విద్యార్థులు పేర్కొనడం విశేషం. కరస్పాండెంట్ టి శేషగిరిరావు, రూప రంగారావు శంకర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జలీల్‌పురంలోని ఖదీమ్ జామియా ఇస్లామియా అరేబియా పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలనా దినోత్సవంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన ఒకరోజు ఉపాధ్యాయులకు పాఠశాల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ముస్తాక్ చౌదరి, ఖజం అహ్మద్, షకీల్, ముస్తఫాఖాద్రి, సామాజిక కార్యకర్త వెల్లంకి పురుషోత్తంరెడ్డి బహుమతులు అందజేశారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కనబర్చిన ప్రతిభను గుర్తించి ఉత్తమ ప్రతిభను చాటుకున్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్.రమాదేవి పాల్గొన్నారు.

పాశ్చాత్య సంస్కృతిని బహిష్కరించాలి

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 17: కుటుంబాలను, జీవితాలను హరిస్తున్న విదేశీ సంస్కృతిని విద్యార్థులు బహిష్కరించాలని శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్ అన్నారు. శనివారం భువనగిరిలో నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం పెరగడానికి, తప్పుడు పనులు, ఆలోచనలకు విదేశీ సంస్కృతే కారణం అవుతున్నదని అన్నారు. ఈ మేరకు విద్యార్థుల్లో అవగహన కల్పించేందుకు శివసేన ప్రయత్నిస్తున్నదన్నారు అన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ వెంకట్రావు, నాయకులు బసంతి, జ్ఞానేశ్వర్, రమేష్, రాజు,నరేష్,జ్యోతి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

సైకో వీరంగం.. ముగ్గురిపై దాడి

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 17: సైకో వీరంగం సృష్టించి ముగ్గురు మహిళలపై దాడి చేశాడు. ఈ సంఘటన భువనగిరి పట్టణ శివారులోని రాయిగిరిలో శనివారం జరిగింది. రాయిగిరి గ్రామానికి చెందిన బీనబోయిన లక్ష్మమ్మ ఇంటి వరండాలో కూర్చోగా ఓ సైకో ఆమె వద్ద ఉన్న చేతి కర్రను లాక్కొని దాడి చేశాడు. అదే విధంగా పక్కనే ఉన్న పద్మ, రమణమ్మలపై కూడా అదే కర్రతో దాడి చేశాడు. గమనించిన స్థానికులు గాయపడిన వారిని జిల్లాకేంద్ర ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించి సైకోను తాడుతో నిర్బంధించి దేహశుద్ధి చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సైకోను కూడా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అతడికి కాపలాగా ఉన్నారు. కాగా అతడు పేరు చెప్పడం లేదని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యగా అతడిని ఆసుపత్రిలో చేర్చినట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఫోర్జరీ కేసులో ఇద్దరు రిమాండ్

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 17: ఓ స్థల వివాదానికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో అధికారులనే మోసం చేసిన ఘటనకు సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాఘవేం దర్‌గౌడ్ తెలిపారు. మండలకేంద్రానికి చెందిన ఏపూరి శివయ్య తన కుటుంబానికి సంబంధించి వివాదం ఉన్న భూమిని తన పేరున చేయాలని పంచాయతీ కార్యదర్శి నరేష్‌కు ఇటీవలే అర్జీ పెట్టుకున్నాడు. స్థలానికి సంబంధించి పత్రాలు లేకపోవడంతో కార్యదర్శి తిరస్కరించాడు. మాజీ ఉప సర్పంచ్ సంజీవ శివయ్య దగ్గర కొంత డబ్బును తీసుకొని ఫోర్జరీ సంతకం ద్వారా నకిలీ స్టాంపుతో సంబంధిత పత్రాలను తయారు చేసి చౌటుప్పల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో రిజిస్టేషన్‌చేసే ప్రయత్నం చేశారు. ఫోర్జరీ సంతకాన్ని గుర్తించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బంది గుర్తించి పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించడంతో అసలు విషయం బయటపడింది. దీంతో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా మాజీ ఉప సర్పంచ్ ఉప్పరగొని సంజీవపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. నాయకులు కత్తుల లక్ష్మయ్య, నాయకులు లారీ బిక్షం, చిలువేరు బిక్షం, ఏర్పుల అంజమ్మ, వడ్డేపెల్లి రాములు,పాలకుర్ల సతీష్ గౌడ్, చింతకింది ఉషా, రాచకొండ గిరి,కొపు:సత్యనారాయణ, ఎడ్ల సత్తయ్య, ఉప్పల శ్రీను పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

అడ్డగూడూరు, ఫిబ్రవరి 17: అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి చెందింది. ఎస్ఐ నాగరాజు వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కప్పల నర్సమ్మ(45) ఆమె భర్త కప్పల యాదయ్యతో కలిసి గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగించేవారు. కొంత కాలంగా వారికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం స్వగ్రామానికి వస్తూ అడ్డగూడూరు పట్టణ శివారు చెరువుకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన పురుగుల మందు తాగి మృతిచెందిన నర్సమ్మను చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రామన్నపేట ఆసుపత్రికి తరలించిన్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



చిక్క రాకేష్(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 17: ప్రేమించిన యువతి తనను కాదనడంతో తట్టుకోలేని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన భూదాన్‌పోచంపల్లి పట్టణం పద్మానగర్‌కాలనీలో జరిగింది. ఎస్ఐ కె. భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన చిక్క రాకేష్(22) హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. రాకేష్, ఓ యువతి ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. రాకేష్ స్నేహితుడైన నితిన్‌తో ఆమె స్నేహితంగా ఉంటూ ఇద్దరు కలిసి బండిపై వెళ్తుండగా రాకేష్ చూశాడు. నితిన్ లవ్ ప్రపోజ్ చేయగా ఆ యువతి కూడా ప్రేమించడం ప్రారంభించింది. విషయం తెలిసిన రాకేష్ ప్రేమికుల దినోత్సవం రోజు యవతిని ప్రశ్నించాడు. తాను అలా ఎందుకు చేస్తానని సమాధాన మిచ్చింది. నాతో మాట్లాడడానికి అర్హత లేదని అతనిని చెంపపై కొట్టింది. ఇదే కోపంతో రాకేష్ నితిన్‌ను ప్రశ్నించగా.. చేయి చేసుకోవడంతో మనస్తాపానికి గురైన రాకేష్ అదేరాత్రి 12గంటల సమయంలో ఇంట్లో వాళ్లను లేపి సీసాలో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను పక్కకుపెట్టుకుని ఇంట్లో వాళ్లను ఒక గదిలో ఉంచి గడియ పెట్టుకొని తనను మోసం చేశారని పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. అతని మరణ వాఙ్మూలాన్ని అనుసరించి ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేసుకున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించారు. రాకేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణోత్సవం


భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 17: పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయం 47వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవ మూర్తుల కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు, మంగళసూత్రాలు, తలంబ్రాలు సీత చంద్రయ్యశ్రేష్టి నర్సమ్మ కుమారులు సీత దామోదర్ హేమలత, సీత హరినాథ్ శోభారాని, సీత కాశీవిశ్వనాథ్ సంగీత అందజేశారు. అనంతరం సీత సోమయ్యశ్రేష్టి లక్ష్మీనర్సమ్మ కుమారులు సీత శరత్‌చంద్రవశిష్ట రాధిక, సీత వెంకటేశం పద్మిని, సీత భావనాఋషి నిహారిక ఆధ్వర్యంలో నైవేద్య నివేదన, కల్యాణ కర్తలకు భోజనవసతి కల్పించారు. ఉత్సవాల్లో దేవాలయం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బడుగు చండికేశ్వర్, ఉపాధ్యక్షుడు బోగ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రుద్ర బాలరాజు, కోశాధికారి మంగళపల్లి రాజారమేష్, ధర్మకర్తలు కర్నాటి భార్గవి, ఎలగందుల రాజ్యలక్ష్మీ, సీత వరమ్మ, పట్నం పారిజాత, భారత బాల రత్నం, గోలి యాదగిరి, మంగళపల్లి రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

మార్కండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ప్రసిద్ధ మార్కండేశ్వరస్వామి దేవాలయం 47వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వైభవంగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం శివ పంచాయతీ యజ్ఞం, రుద్రాభిషేకం, మార్కండేశ్వర స్వామి అష్టోత్తర శతనామావళి పూజ పద్మశాలి చేనేత కార్మిక చీరల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అంకం మురళి, అధ్యక్షుడు రాపోలు శ్రీనివాస్, గౌరవ సలహాదారులు బోగ రమేష్, నాయకులు ఏలె పాండు పాల్గొన్నారు. పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ సూరపల్లి రమేష్ రాధిక ఆధ్వర్యంలో స్వామివారికి నైవేద్య నివేదన నిర్వహించారు. ఉత్సవాల్లో దేవాలయం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బడుగు చండికేశ్వర్, ఉపాధ్యక్షుడు బోగ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రుద్ర బాలరాజు, కోశాధికారి మంగళపల్లి రాజారమేష్, ధర్మకర్తలు కర్నాటి భార్గవి, ఎలగందుల రాజ్యలక్ష్మీ, సీత వరమ్మ, పట్నం పారిజాత పాల్గొన్నారు.



పోచంపల్లిలో బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ధర్మకర్తల మండలి బృందం సభ్యులు



భూదాన్‌పోచంపల్లి: శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఉత్సవ నిర్వాహకులు

భద్రాదేవి- భావనారుషి కల్యాణోత్సవాల ముగింపు

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలోని శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన భద్రావతి- భావనారుషి కళ్యాణోత్సవాలు ముగిశాయి. సుప్రభాతం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శత ఘటాభిషేకం, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల్లో దేవతామూర్తుల శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమాల్లో మునిసిపల్ కౌన్సిలర్ పి.శ్రీధర్‌బాబు, ఆలయ అధ్యక్షుడు గోశిక నర్సింహ, ప్రధాన కార్యదర్శి గోశిక భావనారుషి, అన్నదాత మనసం శ్రీనివాస్, కమిటీ ప్రతినిధులు బడుగు బాలరాజ్, వనం ధనుంజయ్య పాల్గొన్నారు.

మార్కండేయ స్వామి ఊరేగింపు

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మార్కండేయ స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రజలు దారి పొడవునా ఉత్సవ మూర్తులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో శతఘటాభిషేకానికి పవిత్ర జలాలను తీసుకువస్తున్న మహిళలు